క్లుప్తంగా

రేపు నగరంలో నిరసన ర్యాలీ

కడప కల్చరల్ : తమిళనాడుకు చెందిన రాజకీయవేత్త ఉదయనిధి స్టాలిన్ భారతీయ సనాతన ధర్మానికి వ్యతిరేఖంగా చేసి వ్యాఖ్యలకు నిరసనగా విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదికలు నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు సంస్థల ప్రతినిధులు బెస్తవేముల రామమహేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండు వద్దగల అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకున్న తర్వాత సంస్థల ప్రతినిధులు తమ నిరసనను తెలిపే వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

కడప తాలూకా సీఐగా రాజా



కడప అర్బన్ : నగరంలోని తాలూకా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా పి.రాజా బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా అవుకుకు చెందిన ఆయన వ్యవసాయకుటుంబం నుంచి వచ్చారు. 2002 బ్యాచ్‌లో ఎస్ఐగా ఎంపికై మొదట అనంతపురం జిల్లా రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా విధుల్లో చేరారు. 2012లో సీఐగా పదోన్నతి పొందారు. సీఐగా కడప సీసీఎస్, అనంతపురం సీసిఎస్‌లో పనిచేశారు. అనంతపురం జిల్లా ధర్మవరం టూటౌన్ సీఐగా పనిచేస్తుండగా, కడప తాలూకా సీఐగా బదిలీపై వచ్చారు. తమ పరిధిలో శాంతి భద్రతలకు అందరి సహకారంతో తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలుచోట్ల అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని అర్బన్ బాలుర హాస్టల్, జిల్లా పరిషత్ ఆవరణలోని నిరాశ్రయుల వసతి గృహంలో ఏర్పాటు చేశారు. అలాగే పాత బస్టాండులోని సంస్థ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బ్రహ్మయ్య పర్యవేక్షణలో 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గౌరీ శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను తొలగించవద్దు



ఇళ్ల కూల్చి వేతను అడ్డుకుంటున్న భగత్‌సింగ్‌నగర్ ప్రజలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని భగత్‌సింగ్ నగర్‌లో పేదల ఇళ్లను తొలగించరాదని సీపీఎం నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి, డి.ఎం.ఓబులేసు కోరారు. బుధవారం 45వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో పేదల ఇళ్లను అధికారులు తొలగించడాన్ని సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. 20 సంవత్సరాలుగా నివాసం ఉన్న పేదల ఇళ్లను తొలగించాలని అధికారులు అదేశాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కరెంటు బిల్లులు చెల్లిస్తూ, ఇంటి పన్ను కడుతూ, అనుబంధ పత్రాలు పొంది ఉన్నారన్నారు. ఊటుకూరు చెరువు అభివృద్ధి పేరుతో ఇళ్లను తొలగించాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడాలని రెల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ.బాదుల్లా, ఎస్.మహబూబ్‌బాషాలు బుధవారం యూనియన్ కార్యాలయంలో ఈనెల 8న సీపీఐ తలపెట్టిన బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తదితరులు హాజరవుతున్నారని ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అమలఆరోక్యరాజ్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని లయోలా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శంకరయ్య, గంగాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా.. ముకుందా.. మురారి

ఘనంగా కృష్ణాష్టమి పూజలు



ద్వారకా నగర్‌లోని ఆలయ వెలుపల భక్తుల సందడి

కడప కల్చరల్ : శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం కడప నగరం ద్వారకానగర్‌లోని శ్రీ మురళీకృష్ణాలయంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. ఆలయ నిర్వాహకులు రామమునిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. గురువారం ప్రధాన పూజోత్సవాలు ఉంటాయని నిర్వాహకులు ప్రకటించడంతో భక్తుల సంఖ్య మునుపటితో పోలిస్తే పలుచగా కనిపించింది. మొదటి అంతస్తులో ఉన్న స్వామిని దర్శించుకునేందుకు ఆలయప్రాగణంతో పాటు మెట్లపై కూడా బారులు తీరారు. ప్రధాన అర్చకులు కృష్ణకిరణ్ ఆధ్వర్యంలో సుప్రభాతం, మూలమూర్తికి అభిషేకం, అగ్నిప్రతిష్ట, మూలమంత్ర పురషసూక్త, సుదర్శన హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ వైస్ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, సభ్యులు ప్రసాదరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సాయంత్రం ఆలయం ఎదుట చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

బలిజసంఘం ఆధ్వర్యంలో....

బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. నగర శివార్లలోని మాచుపల్లె రోడ్డులోని శ్రీకృష్ణాలయంలో ఉదయం 9 గంటల నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

బాలవికాస్ పాఠశాలలో..



బాలవికాస్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు



గురుకుల్ విద్యాపీట్‌లో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

బాలవికాస్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల్ విద్యాపీట్ పాఠశాలలో...

కడప గురుకుల విద్యాపీట్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏవీఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, సీఈఓలు వివేకానంద, పల్లవి, ఏడీలు చంద్రమోహన్, గీత, ఏవో అకాష్‌నందర్, ప్రిన్సిపాల్ మునిచంద్రలు పాల్గొన్నారు.

ఆరోగ్యమాత ఆశీస్సులు పొందుదాం

కడప కల్చరల్ : నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నవదిన ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం పోరుమామిళ్ల డీన్ విచారణ గురువులు రెవ ఫాదర్ జాల విజయభాస్కర్ దివ్యబలి పూజను సమర్పించగా, మరియతల్లి సందేశాన్ని బి.కోడూరు విచారణ గురువులు రెవ ఫాదర్ అరుణ్‌కుమార్ అందించారు. గురువులు మాట్లాడుతూ ఎనిమిది రోజుల పాటు ఈ క్షేత్రంలో ఆరోగ్య మాత ఉత్సవాలు వైభవంగా నిర్వహించామన్నారు. ఆరోగ్య మాత స్వరూపాన్ని అలంకరించి పల్లకిలో క్షేత్ర ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీని జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నేడు రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్ర గురువారం నాటికి సంవత్సరం పూరైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు జయప్రదం చేయాలన్నారు.

గురువులందరికీ క్షమాపణ చెప్పాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడిన పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తక్షణం ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ఈ వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. అలాగే యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆయన ఉపాధ్యాయ లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గురువుల కన్నా గూగుల్ మిన్న అని మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడటం సరిగా లేదని ఏపీ ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. కడపలోని ఏపీ ఎస్టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేసిన మీరు గురువులను ఇలా తక్కువ చేసి మాట్లాడటం బాధాకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కడప కల్చరల్ : నగరంలోని కేంద్ర కారాగారం వద్ద ఉన్న శ్రీ సర్వేశ్వరమహర్షి ఆశ్రమంలో బుధవారం లోక కల్యాణార్థం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు విజయబట్టార్, సుదీర్‌శర్మలు తొలిత గోపూజ నిర్వహించి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆశ్రమ సేవా సమితి అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, ధార్మికవేత్త విజయానందరెడ్డి, మారెమ్మ ఆలయ అధ్యక్షుడు సట్టి భారవి పర్యవేక్షణలో పూజోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, కార్పొరేటర్లు, బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధి డాక్టర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ నోటీసులపై చంద్రబాబు నోరు విప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులపై టీడీపీ నేత చంద్రబాబు నోరు విప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రతి అంశంలోనూ వేల కోట్లు కమీషన్లు తీసుకున్నారని, ఆ పార్టీ నేతలు కూడా దోచుకోవడం, దాచుకోవడమే పనిగా చేసుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో బాబు రూ.118 కోట్లు కమీషన్లుగా తీసుకున్నారని ఐటీ శాఖ రుజువులతో సహా బయటపెట్టిందన్నారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిన చంద్రబాబు తేలు కుట్టిన దొంగలా నోరు మెదపడం లేదని విమర్శించారు. బాబు అక్రమార్జనలో ఇదొక భాగం మాత్రమేనని, ఇలాంటి ఎన్నో స్కాములు ఆయన చేశారని తెహల్కా డాట్ కాం ఎప్పుడో బయటపెట్టిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో తండ్రీ తనయులు చేసిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రహస్య కోడ్‌లు ఉపయోగించి వందల కోట్ల ప్రజాధనాన్ని వీరు లూటీ చేశారన్నారు. చంద్రబాబు జీవితమంతా ఆర్థిక నేరాలు, కుట్రలు, కుతంత్రాలతోనే సాగిందని, ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నిత్య, ఫయాజ్ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



రహమతుల్లా, ప్రసాద్‌రెడ్డిలను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు



హెడ్‌టీచర్ యాస్మిన్‌బేగంను సన్మానిస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపికైన పాతకడప జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన ఇంగ్లీష్ టీచర్ రహమతుల్లా, మ్యాథ్స్ టీచర్ ప్రసాద్‌రెడ్డిలను బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశ్వభారతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే 20వ వార్డులోని గాండ్లస్ట్రీట్ నగరపాలక ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ యాస్మన్‌బేగం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా బుధవారం కాంప్లెక్స్ హెచ్ఎం నాగమణి, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్లకు గురువారం ఉదయం 9గంటలకు కడప నగర సమీపంలోని ఫాతిమా కళాశాల వద్ద ఉన్న మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెండ్లిమర్రి మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డిలు హాజరవుతారన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న మెప్మా అధికారి గంగులయ్య

పులివెందుల రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మెప్మా అధికారి గంగులయ్య అన్నారు. బుధవారం పాతబస్టాండు సమీపంలో ఉన్న మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న సంఘాలు బలోపేతం అయ్యే విధంగా ఆర్పీలు వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశాల నిర్వహణ, లీడర్ల బాధ్యతలు, పుస్తకాలు వ్రాయడం వల్ల ఉపయోగాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా జగనన్న మహిళా మార్టులో నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తూ మార్టు అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలన్నారు. జగనన్నతోడు, పీఎం స్వనిధి, చిరువ్యాపారులకు రూ.10వేలు, రెండవ విడత రూ.20వేలు, మూడవ విడత రూ.50వేలు తీసుకుని వ్యాపారాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఓ నాయుడు, ఆర్పీ లక్ష్మి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు అష్టలక్ష్మీ వ్రతం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని కాలక్షేప మండపంలో ఈనెల 8న శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 9 గంటలకు అష్టలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టలక్ష్మీదేవిల వ్రతం 108 ముత్తయిదువులతో ఘనంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

చేతి వృత్తుల కళాకారులు విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

జమ్మలమడుగు : చేతి వృత్తుల కళాకారులు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బడిగించల చంద్రమౌళి పేర్కొన్నారు.

బుధవారం పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న విజ్ఞాన్ పాఠశాలలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పథకం ద్వారా సుమారు 30శాతం హస్త కళాకారులకు, చేతి వృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకం కింద శిక్షణ ఇవ్వడంతోపాటు లక్ష రూపాయల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తారన్నారు. శిక్షణ సమయంలో రోజుకు 500 రూపాయలు, ఉచిత భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయాలలో ఉన్న కామన్ సర్వీసు సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు తగదు

పులివెందుల టౌన్ : సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని బీజేపీ నాయకుడు శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీవెంకటేశ్వర ఆలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కించపరుస్తూ ఎవరు మాట్లాడినా సహించేదిలేదని హిందూ ఐక్యవేదిక సభ్యులు పేర్కొన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్యాధరి భానుప్రకాష్, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చంద్రమహేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ స్ట్రీట్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాచమల్లు



స్మార్ట్ స్ట్రీట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులో పుట్టపర్తి సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జరుగుతున్న స్మార్ట్ స్ట్రీట్ పనులను బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. తొలివిడతగా రూ.1.83 కోట్లతో పనులు చేపడుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీపీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

నేడు అర్కటవేములలో కల్యాణం

రాజుపాళెం : అర్కటవేముల గ్రామంలోని శ్రీ మదన గోపాలస్వామి ఆలయ ఆవరణంలో గురువారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ వంశ పారంపర్య అర్చకులు క్రిష్టపాటి వెంకయ్య స్వామి కుమారుడు నందకిషోర్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కల్యాణం, 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం, కోలాటం కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కల్యాణోత్సవానికి గ్రామంలోని ప్రజలు, మహిళలే కాక చుట్టుపక్కల గ్రామాల వారు కూడా రావాలని ఆయన కోరారు.

భగవద్గీత పఠనంతో విద్యార్థులకు నైతిక విలువలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎస్ఏ పీడీ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : విద్యార్థులు చిన్నతనం నుంచే భగవద్గీత పఠనం చేయడం ద్వారా వారిలో నైతిక విలువలు పెంపొందుతాయని సర్వశిక్షాభియాన్ పీడీ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక తెలుగుగంగకాలనీలోని సమితి ఆశ్రమంలో బుధవారం విద్యార్థులకు భగవద్గీతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి నిఖిత, రెండవ బహుమతి ఉషశ్రీ, మూడవ బహుమతి పూజితలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు, రిటైర్డ్ ఎంఈఓ రామసుబ్బయ్య, రామకృష్ణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పర్యాటకశాఖ విశ్రాంతి భవనం



శిథిలావస్థలో ఉన్న పర్యాటక శాఖ విశ్రాంతి భవనం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో పర్యాటక శాఖ విశ్రాతి భవనం శిధిలావస్థకు చేరింది. ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడినన ఈ విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరుకున్నా పర్యాటక శాఖ అధికారులు పటించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకొనేందుకు వచ్చిన భక్తులకు పర్యాటక విశ్రాతి భవనం ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. 200లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పర్యాటక కేంద్రాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో బి.మఠంలో అప్పటికే ఉన్న విశ్రాతి భవనానికి ప్రత్యేక నిధులు కేటాయించి నూతనంగా రూపుదిద్దారు. మూడు డబుల్ బెడ్ రూములు, పెద్ద కామన్‌హాల్, కిచెన్, సమావేశ మందిరం, విశాలమైన ప్రదేశం, వాహన పార్కు వంటివి ఉన్నాయి. అప్పట్లో రాజకీయ నాయకులు కూడా ఇక్కడనే సభలు, సమావేశాలు, నిర్వహించుకునేవారు. ఇక్కడ ఇద్దరు వాచ్‌మన్లు, వంట మనిషి ఉండేవారు. పర్యాటకులు కూడా ఎక్కువగా వచ్చేవారు. అందుకు తగ్గటుగా ఆదాయం వచ్చేది. గత 10 సంవత్సరాలుగా పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో సిబ్బంది లేక ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. బి.మఠంలో యాత్రికుల కోసం సరైన విశ్రాతి భవనాలు లేక ఇబ్బందులు పడక తప్పడంలేదు. దేవస్థానం పరిధిలో ఉన్నవి చిన్న చిన్న గదులు కల్గిన కాటేజిలు ఉడడంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా పర్యాటకశాఖ అధికారులు విశ్రాతి భవనానికి మరమ్మతులు చేయించి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

రేపటినుంచి విగ్రహప్రతిష్ట వేడుకలు



నూతన దేవస్థానం

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో నిర్మించిన నూతన దేవస్థానంలో నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వరసిద్ధి వినాయక, శ్రీకోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విశ్వక్సేన ఆరాధన, మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణము, జలాధివాసం ఉంటుందన్నారు. శనివారం మహాకుంభ స్థాపన, మూలవిరాట్‌ల గ్రామోత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ఆదివారం శిఖర, కలశ, ధ్వజస్తంభ, నాగుల ప్రతిష్ట కార్యక్రమాలు, శ్రీ సీతారామ తిరు కల్యాణం, అనంతరం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు.